క్లుప్తంగా

నేడు పద్మనాభస్వామి కల్యాణం

కొత్తూరు: మండల పరిధి పెంజర్ల గ్రామంలో అనంతపద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీజేపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో కేంద్ర మంత్రి

యాచారం: బీఆర్‌ఎస్ నాయకురాలు, నల్లవెల్లి మాజీ సర్పంచ్ శోభ, ఆమె భర్త బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రాములు, పలువురు కార్యకర్తలు ఆదివారం నగరంలోని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భూపాల్‌గౌడ్, యాచారం మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ అభయాంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో పది, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు మాధవి, అశోక్, చందన, కిశోర్, వైష్ణవి, ధృవాంశలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, సత్తయ్య, సాయికుమార్, మురళీధర్, పరమేశ్, సుధాకర్, లింగం, ఈశ్వరయ్య, లింగప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని నందుపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ దేవి లంద ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి, లందకు మయిలలు తీసి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి గ్రామ పెద్దలు బోనాలు సమర్పించి డప్పు వాయిద్యాలతో శివ సత్తుల పూనకాలు, యువకుల నృత్యాలతో సందడి చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డి.నర్సింహ మాట్లాడుతూ ప్రజలందరిని ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని, సకాలంలో వర్షాలు కురిపించి పాడి పంటలు పండే విధంగా ఆశీస్సులు ఉండాలని కోరారన్నారు. ఈ కార్యక్రమంలో దేశపాగ నర్సింహ, బి.రాజు, జగదీష్‌గౌడ్, బి.రవి, ఇజాజ్, ఆర్.రవి, కె.సత్తయ్య, బి.సత్తయ్య, జి.చంద్రయ్య, ఆర్.వెంకటయ్య, ఎ.నర్సింహ, హబీబ్, జంగయ్య, జయేందర్, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్‌లో బెస్ట్ ఎడ్యుకేషన్


శ్రీజరెడ్డిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

హుడాకాంప్లెక్స్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సరూర్‌నగర్ బ్రాంచ్‌లో పదో తరగతిలో విద్యార్థులు ఏటా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈసారి శ్రీజరెడ్డి 594 మార్కులతో రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. అనంతరం స్కూల్ ఫౌండర్ చైర్మన్ కడారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 25 సంవత్సరాల క్రితం స్థాపించిన తమ పాఠశాలలో విలువలతో కూడిన బోధన అందిస్తున్నామని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన శ్రీజరెడ్డితో పాటు ఉన్నతమైన మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కడారి మాధవి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మజారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. పంటకు రక్ష

- రసాయనాల వాడకం తగ్గించేందుకు ప్రత్యామ్నాయం
- రైతులకు సబ్సిడీపై విత్తనాలు


పచ్చిరొట్ట సాగు

షాబాద్: అధిక దిగుబడులే లక్ష్యంగా పంటల సాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం హానికరమని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వీటితో భూసారం దెబ్బతింటుందని స్పష్టం చేస్తున్నారు. క్రమంగా పంటలో సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తాయని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే భూసారం పెంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట సాగు చేసి, పంటలను కాపాడుకోవాలని సూచిస్తున్నారు.

సాగుకు ముందు..

జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర, అలసంద వంటివి ప్రధాన పంటల సాగుకు ముందు పొలంలో పండించి.. తరువాత కలియదున్నడం ద్వారా మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. ఫలితంగా రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో పాటు వాటి కోసం అయ్యే ఖర్చు, పంట నాణ్యత ఇలా ఎన్నో లాభాలు పొందవచ్చని చెబుతున్నారు.

నత్రజని, భాస్వరం పుష్కలం

జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర సాగు మొగ్గదశ వరకు పెంచాలి. ఆ తరువాత భూమిలో కలియ దున్నాలి. సాధారణంగా ఇవి పూత దశకు రావడానికి 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఇవి లెగ్యూం జాతికి చెందినవి కావడంతో నత్రజని స్థాపనకు ఎంతగానో తోడ్పతున్నాయి. వీటితో పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం లభిస్తుంది. దీంతో రసాయన ఎరువులు యూరియా, డీఏపీ వాడకం తగ్గుతుంది. సాధారణంగా మే, జూన్ నెలలో తొలుత దుక్కిని దున్ని, విత్తనాలను చల్లుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు.. అందుకు తగిన సలహాలు, సూచనలు రైతులకు ఇస్తున్నారు. పచ్చిరొట్టతో ప్రయోజనం పొందాలని సూచిస్తున్నారు.

అధిక దిగుబడి



పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా అవుతుంది. సాగు చేసిన పంటలకు సేంద్రియ ఎరువులతో పాటు నత్రజని అందిస్తుంది. దీంతో పంటలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగి, అధిక దిగుబడులు వస్తాయి. రసాయన ఎరువులు వాడకం, వాటికోసం అయ్యే ఖర్చు తగ్గుతుంది.

– వెంకటేశం, మండల వ్యవసాయ అధికారి, షాబాద్


విజేత జట్లకు నగదు, జ్ఞాపిక అందజేస్తున్న డీసీపీ శ్రీనివాస్ తదితరులు

క్రీడాకారులను ప్రోత్సహించాలి

- రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్
- ముగిసిన పీవీఆర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఖాజామొహిజుద్దీన్, సీఐ పవన్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. మున్సిపాలిటీలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పీవీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ పోటీల్లో రెడ్డిపల్లి, అజీజ్‌నగర్ తలపడగా విజయం రెడ్డిపల్లిని వరించింది. రన్నర్‌గా అజీజ్‌నగర్ టీమ్ నిలిచింది. ఈ సందర్భంగా ప్రథమ విజేతకు రూ.లక్ష, రన్నర్‌కు రూ.50 వేల నగదును టోర్నీ నిర్వాహకులు పట్లోళ్ల బిందురెడ్డి, చెన్నారెడ్డి, సుజాతరెడ్డిలు అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. క్రీడలు శరీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అనంతరం టోర్నీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్, వ్యాపారవేత్త సత్తయ్య, ఏబీవీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ


బెల్టులు ప్రదానం చేస్తున్న దేవేందర్‌యాదవ్

కొత్తూరు: ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని మాజీ ఎంపీటీసీ దేవేందర్ యాదవ్ కోరారు. కొత్తూరు పట్టణంలో ఆదివారం బోధిధర్మ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్పైరింగ్, కటాస్‌తో పాటు ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. యుద్ధ విద్యలు నేర్చుకోవడంతో విద్యార్థులు, యువతలో చక్కని క్రమశిక్షణ అలవడుతుందన్నారు. దానికి తోడు భవిష్యత్తులో పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించి.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుంగ్‌ఫూ మాస్టర్ నర్సింహ్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని 12,13 వార్డుల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం గూడూరు మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులను పూర్తి చేసి, వినియోగంలోకి తెస్తామని పేర్కొన్నారు. మండలంలో సీడీఎఫ్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.30 కోట్లతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేశ్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు శ్రీను, రమేశ్, భానుకిరణ్, మహేశ్, శ్రీకాంత్, రామకృష్ణ, నరేశ్, చింటు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో నాటి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాద్‌నగర్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మండల పరిధి వెలిజర్ల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల 2004– 05 విద్యాసంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు.. సుదీర్ఘ కాలం అనంతరం ఒకే వేదికగా సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ క్షేమసమాచారం తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఆలయ విస్తరణకు చర్యలు

కందుకూరు: మండలంలోని లేమూరు పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రముఖ స్థపతి శివనాగిరెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ విస్తరణకు చేయాల్సిన పనుల గురించి మాట్లాడారు. ప్రస్తుతం దేవాలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం తీర్చిదిద్దేలా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆలయ నిర్వాహకులు ఆయన్ని కోరారు. అందులో భాగంగా మహా మండపం, ధ్వజస్తంభం, బలిపీఠం, రాజగోపురం, కోనేరులను తిరిగి నిర్మించాల్సి ఉంటుందని ఆలయ నిర్వాహకులకు శివనాగిరెడ్డి తెలిపారు. ఆయన వెంట ఆలయ నిర్వాహకులు గూడూరు కొండారెడ్డి, ఢిల్లీ బాలకృష్ణ, రావిచెట్టు ఐలయ్య, ఢిల్లీ గణేష్, కేశిడి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎప్‌సెట్‌లో కీర్తన ప్రతిభ



బడంగ్‌పేట్: ఆదివారం విడుదల చేసిన టీజీ ఎప్‌సెట్–2025లో బడంగ్‌పేటకు చెందిన దళితబిడ్డ గుడ్ల కీర్తన అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 2154 ర్యాంక్ సాధించి క్వాలిఫై అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి మంచి ర్యాంకు సాధించినందుకు తండ్రి గుడ్ల శ్రీనివాస్ అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి తుల్జాభవాని కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా రాత్లావత్ శంకర్‌లాల్, ప్రధాన కార్యదర్శిగా టి.శివకుమార్‌రెడ్డి, కోశాధికారిగా నినావత్ జీవన్‌కుమార్ నాయక్, ఉపాధ్యక్షులుగా ఎస్.మురళీకృష్ణ, అనిల్, శంకర్, సహాయ కార్యదర్శిగా జంగయ్య, న్యాయ సలహాదారుడిగా లక్పతినాయక్, శివకుమార్, నమ్యానాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

అమ్మ ప్రేమ వెలకట్టలేనిది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


వృద్ధులకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: సృష్టిలో అమ్మ ప్రేమ వెలకట్టలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం యూవైసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధి లింగారెడ్డిగూడ శివారులోని ఎఫ్‌సీఎస్ ఫౌండేషన్‌లో అనాథ వృద్ధులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ అనే పిలుపు ఒక అందమైన అనుభూతి అన్నారు. మాతృ బంధం ఎంతో అద్భుతమైనదని, పిల్లల కోసం ఆమె పడే తపన వర్ణించలేనిదని పేర్కొన్నారు. సమాజంలో పిల్లలను ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో తల్లి కీలక పాత్ర పోషిస్తుందని, జీవితంలో ఆమె రుణం తీర్చుకోలేనిదని స్పష్టంచేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశాల శ్రావణ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, ఇబ్రహీం, ఖదీర్, ఆలియా సుల్తానా, రఘు నాయక్, సబియా సుల్తానా, యాస్మిన్, ఉస్మాన్, సోహెల్, మతానీ, సయ్యద్ సయూద్, అర్బాజ్, ఫౌండేషన్ నిర్వాహకులు గీతా థామస్ తదితరులు పాల్గొన్నారు.

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి


నియామక పత్రాలు అందుకుంటున్న నూతన కమిటీ సభ్యులు

షాద్‌నగర్: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీసేన మహిళా మండల అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధి కందివనం గ్రామంలో సేన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా.. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. స్త్రీలు సంఘటితంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. కమిటీ మహిళా అధ్యక్షురాలిగా కావలి అనురాధ, ప్రధాన కార్యదర్శిగా యాదమ్మ, పలువురు సభ్యులను నియమించారు. అనంతరం నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, మేకల వెంకటేశ్, స్రవంతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గంగాభవాని కాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు సుప్రభాతం, ధ్వజారోహనం, అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, హనుమాన్‌హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, సభ్యులు పరమేశ్, అప్పి, సుధాకర్, లింగం, ఈశ్వరయ్య, యాదగిరి, లింగప్ప, అశోక్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి న్యామతాపూర్ గ్రామానికి చెందిన సంతోజు పరిపూర్ణచారి ఆరోగ్య సమస్యలతో నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.82 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం బాధితుడికి.. ఎమ్మెల్యే కసిరెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోదాస్ మహేశ్ తదితరులు ఉన్నారు.


మంచాల: బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

మంచాలలో..

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ కొర్ర శ్రీనివాస్ నాయక్ అన్నారు. అనారోగ్యంతో ఇటీవల చనిపోయిన లోయపల్లిగ్రామవాసి తోడుసునూటి లచ్చులుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయం కింద ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో రూ.60 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆదివారం లోయపల్లిలో బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేశారు. ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాం దాస్, నాయకులు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి

- కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి
- జవాన్ కుటుంబీకులకు పరామర్శ

ఇబ్రహీంపట్నం: పాకిస్తాన్‌తో పోరాడి వీరమరణం పొందిన జవాన్లకు ఇబ్రహీంపట్నంలోని ఏబీసీడీ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులతో అంజలి ఘటించారు. జవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవ్, రావ్ వనాంజేల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ ప్రజల భద్రతకు ప్రాణాలను పణంగా పెట్టిన జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరిచిపోలేదని అకాడమి మాస్టర్ ముత్యం అన్నారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్స్ సురేశ్, బన్నీ, తారలు పాల్గొన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: భారత్, పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులు మురళీనాయక్ కుటుంబ సభ్యులను ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన పలువురు గిరిజన సంఘం, సేవాలాల్ సంఘం నాయకులు పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్ సత్యసాయిజిల్లా పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధి గోరంట్ల మండలం కల్లితండాల్లో ఆదివారం జవాన్ కుటుంబీకులను గిరిజన నాయకులు నేనావత్ రవీందర్‌నాయక్, శంకర్‌నాయక్, దశరథ్‌నాయక్, దేవీలాల్, ప్రకాశ్‌లు పరామర్శించారు. మురళీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

పూజలు

ఆమనగల్లు: సైనికుల క్షేమం కోసం పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో ఆదివారం ఆలయ పూజారి రామకృష్ణశర్మ నేతృత్వంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో బీజేపీ మాజీ కౌన్సిలర్ సుందూరి శేఖర్, నాయకులు లక్ష్మణ్, రవిరాథోడ్, ప్రశాంత్, ఎర్రవోలు మహేశ్, జగన్‌రెడ్డి, పవన్ కల్యాణ్, సాయిబాబా, శ్రీనివాసాచారి, రామస్వామి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



ఇబ్రహీంపట్నం: అంజలి ఘటిస్తున్న విద్యార్థులు


ఆమనగల్లులో..


ఆమనగల్లు: మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు